క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్య

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో సవళ్లగూడెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్యతో చిన్నారులు, సిబ్బంది, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రంలో చేతిపంపు ఉంది. చిన్నారులు, స్థానికులు తాగునీటిని ఉపయోగించుకునే వారు. చేతిపంపు మరమ్మతులకు గురవగా పైపులు గ్రామ పంచాయతీ వారు తీసివేసి మరల పునరుద్ధరించలేదు. దీంతో నీటి సమస్యతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ అంగన్‌వాడీ కేంద్రానికి చుట్టూ ప్రహరీ కూడా లేదు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం అగ్నిమాపక శాఖ కార్యాలయం ఇన్‌చార్జ్ ఎండి.సాధిక్ అన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఫైర్ ఆక్సిడెంట్, గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించి, కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగితే 101 లేదా 8712699292 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ సమీక్ష

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో బుధవారం డీజీఎం(పర్సనల్) రమేశ్ ఆధ్వర్యంలో ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో.. పలు విభాగాల్లోని కారుణ్య నియామకాల, మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, సకాలంలో క్లెయిమ్స్ పూర్తి చేయాలని సూచించారు. క్లయిమ్స్‌కు సంబంధిత డాక్యుమెంట్లు, గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ తదితర అంశాలపై చర్చించారు. అధికారులు సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, ఓంకార్ బాపు, నరేశ్, సాయి శ్వేత, అరుణ్‌తేజ, వంశీకృష్ణ, లక్ష్మణరావు, మధు, నర్సింహారావు, షాబుద్దీన్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించాలి

పినపాక: మండలంలో నిర్మించిన సీసీ రోడ్లలోని నాణ్యతను పరిశీలించాలని, రోడ్డుకిరువైపులా గ్రావెల్ తోలకాల చేపట్టాలని ఆదివాసీ అభ్యుదయ సంఘం నాయకులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ తరఫున అధికారులు గ్రామాల్లో పర్యటించి నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవాలని, నాణ్యత బాగున్న వాటికే డబ్బులు చెల్లించాలని కోరారు. ఆదివాసీ అభ్యుదయ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్కే దొర, మండల అధ్యక్షుడు కొమరం శీను నేతలు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

బూర్గంపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సారపాక గాంధీనగర్‌లో ప్రతిష్ఠించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు,ప్రజాసంఘాలు సహకరించాలని అంబేడ్కర్ కమిటీ ప్రతినిధులు కోరారు. బుధవారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకు స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు భూవివాదం సృష్టించి అడ్డుకుంటున్నారని, ఈ విషయంలో అధికారులు కమిటీకి సహకారమందించాలని అన్నారు. కమిటీ ప్రతినిధులు ఇరుగు ఈశ్వరరావు, ఇస్రం శ్రీనివాస్, తుమ్మల కిరణ్, సూదిపాక పున్నయ్య, ఈశ్వర్, గంటా మల్లిఖార్జున్, గాడిద రాంబాబు, కొండయ్య, కోటేశ్వరరావు, సాయికుమార్, ఈశ్వర్, జిలుగుదాసు, మోహన్‌రావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాకలగూడెం గ్రామంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పర్యటించి, అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సున్నంబట్టి గ్రామంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని సందర్శించారు. గాలి దుమారంతో మామిళ్లవారిగూడెంకు చెందిన రైతు వెంకటేశ్వరరావు మునగ తోటను పరిశీలించి, బాధిత రైతుకు నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న స్థానిక బీఆర్ఎస్ నాయకుడు యూఎస్ ప్రకాశ్‌రావు సతిమణిని పరామర్శించారు. మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంటకు పరిహారమందేనా?

- అకాల వర్షం, గాలిదుమారంతో వ్యవసాయం అతలాకుతలం
- చేతికొచ్చిన పంట నేలపాలు
- నష్టపోయిన రైతులు.. ఆదుకోవాలని వేడుకోలు

ఆరుగాలం శ్రమించారు.. అప్పులు చేసి సాగు చేశారు.. చివరి తడికోసం అల్లాడిపోయి.. చివరికి అకాలవర్షంతో చేతికొచ్చిన పంటను కోల్పోయారు. ఈ పంటలకు పరిహారం చెల్లించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గాలిదుమారానికి పడిపోయిన మొక్కజొన్న చేను

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఈ యాసంగిలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు, గాలి దుమారానికి పంటంతా నేలపాలైంది. పంట చేతికందే దశలో అకాల వర్షం తమను తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే రెండుసారు అకాల వర్షం, గాలిదుమారంతో వందల ఎకరాల్లో చేలు నేలపై పడిపోయాయి. ఒక్కో ఎకరానికి రూ. 20వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని అయినా పంట చేతికందకుండా పోయిందని వాపోతున్నారు.

నేలవాలినా పరిహారం వర్తించదా?

పంట నష్టంపై అధికారులు నేలపై పడిపోయిన చేన్లకు పరిహారం ఏమీ ఉండదని అంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క భూగర్భ జలాలు అడుగంటిపోతున్నా చివరి తడికోసం పడరాని పాట్లు పడ్డామని అంటున్నారు. కంకిదశలో చేను పడిపోవడంతో వేలల్లో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా అక్కడక్కడ పొద్దుతిరుగుడు చేన్లు సైతం కిందపడిపోయాయి.

ఖరీఫ్‌లో గిట్టుబాటు ధరలు లేక నష్టపోయిన తమకు అకాలవర్షంతో ఇప్పుడు నష్టపోవాల్సి వచ్చింది. మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని, దీంతో బయట తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో సర్వేలు నిర్వహించి, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.

నాలుగు ఎకరాలు పడిపోయింది

ఈ మధ్య వచ్చిన గాలిదుమారానికి నా నాలుగు ఎకరాల మొక్కజొన్న నేలపై పడిపోయింది. కంకులు అయ్యాక చేతికందే సమయంలో అకాల వర్షం దెబ్బతీసింది. ఆరుగాలం శ్రమించినా పంట చేతికందకుండా పోతుంది. అధికారులు పంట సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలి.

– ఎట్టి కృష్ణ, రైతు

నష్టపరిహారం చెల్లించాలి

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షం, గాలిదుమారానికి మొక్కజొన్న చేన్లు పూర్తిగా కింద పడిపోయాయి. ఇలా నేలవాలిన పంటలను కూడా ప్రభుత్వం ధ్వంసమైన పంటగా పరిగణించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి.

–కోరం సీతారాములు

భారీ వర్షం.. గాలి బీభత్సం

అశ్వారావుపేటరూరల్: అకాల గాలివాన మరోసారి అశ్వారావుపేట మండలంలో బీభత్సం సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి గాలి దుమారంతోపాటు భారీ వర్షం కురిసింది. దీంతో అశ్వారావుపేటలోని ఇందిరా కాలనీ వద్ద రామాలయంపై, సాయిబాబా ఆలయం సమీపంలో భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. అలాగే ఇందిరా కాలనీలో ప్రధాన రహదారి పక్కనే ఓ భవనంపై ఉన్న భారీ ఐరన్ హోర్డింగ్ విరిగిపడింది. పట్టణంలోని తూర్పు బజారులో ఒక రేకుల షెడ్డు, అటెండర్స్ కాలనీలో భవనంపై ఉన్న రేకుల షెడ్డు గాలి బీభత్సంతో సమీపంలోని పొలంలో పడింది. అలాగే మెరుపు కాలనీలో ఉన్న కొబ్బరి తోటలో కరెంట్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోగా వైర్లు తెగి పడ్డాయి. మండల పరిధిలోని అచ్యుతపురం-మద్దికొండ ప్రధాన రహదారిపై భారీ వృక్షం విరిగి అడ్డంగా పడిపోయింది. గాలుల కారణంగా అశ్వారావుపేట, ఊట్లపల్లి, తిమ్మాపురం, జమ్మిగూడెం, వినాయకపురంతోపాటు పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. పొగాకు రైతులకూ నష్టం వాటిల్లింది.



అశ్వారావుపేటరూరల్: ఇందిరా కాలనీలో రామాలయంపై విరిగిపడిన చెట్టు



అశ్వారావుపేటరూరల్: మెరుపు కాలనీ కొబ్బరితోటలో విరిగిపడిన కరెంట్ స్తంభం

పంట కాలువలకు భూసేకరణ చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

చంద్రుగొండ: సీతారామ కాలువ నుంచి పంటపొలాలకు, చెరువులకు గోదావరి జలాలు తరలించేందుకు కాలువల నిర్మాణాల ఏర్పాటుకు భూ సేకరణ చేయనున్నట్లు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మండలకేంద్రం చంద్రుగొండ, తిప్పనపల్లి, మద్దుకూరు గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సభల్లో ఆయన పాల్గొన్నారు. మండలంలో మొత్తం 547.07 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉన్నట్లు, భూములు నష్టపోయిన రైతులకు మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు అధిక రేటు చెలించనున్నట్లు తెలిపారు. సభల్లో శాఖాధికారులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించాలి



ధాన్యం తేమశాతాన్ని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిమయ, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. చాపరాలపల్లిలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. రైతులకు పలు సూచనలు చేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ గద్దె రేవతి, ఎంఏఓ అరుణ్‌బాబు, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, డైరెక్టర్ చీకటి ప్రకాశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పర్వతనేని అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

చంద్రుగొండ: ఇందిర బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. మహ్మద్‌నగర్ నుంచి ప్రారంభమైన ఆయన పర్యటన తిప్పనపల్లి, మద్దుకూరు వరకు సాగగా.. 16 పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 83.55 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంఈఓ సత్యనారాయణ, నాయకులు భోజ్యానాయక్, దారం గోవిందరెడ్డి, బడుగు కృష్ణవేణి, సారేపల్లి శేఖర్, ఫజల్‌బక్ష్ ఎండి.ఇమ్రాన్, బొర్రా సురేష్, ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.

కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

మణుగూరుటౌన్: కుక్క దాడిలో వ్యక్తికి గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో జరిగింది. మణుగూరు వైపు వస్తున్న మైనార్టీ నేత రహీం పాషాపై ఎక్సైజ్ ఆఫీస్ వద్ద దాడి చేయగా.. కాలికి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు 100 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఇటీవల శేషగిరినగర్‌లో ఓ బాలుడిపై కుక్కలు దాడి చేయగా, తరచూ కుక్కలు దాడులు చేస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులకు పట్టణ ప్రజలు పలుమార్లు వినతిపత్రాలు అందజేస్తున్నా చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

భద్రాచలంఅర్బన్: క్షయ ముక్త భారత్ కార్యాక్రమంలో భాగంగా భద్రాచలంలోని సబ్ జైల్‌లో సబ్ జైలర్ ఉపేంద్ర నేతృత్వంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీపీపీఎం సోమయ్య క్షయ వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యాక్రమంలో ఎన్‌టీఈపీ సిబ్బంది వెంకటేశ్వర్లు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

ములకలపల్లి: హైదరాబాద్‌లో మే నెల రెండో వారంలో నిర్వహించనున్న ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ పాల్వంచ డివిజన్ కార్యదర్శి దుర్గ, పీవైఎస్ జిల్లా కార్యదర్శి కొర్సా రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే అందాల పోటీల నిర్వహణ యోచనను విరమించుకోవాలన్నారు. పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు కల్లూరి పద్మ, పీవైఎల్ డివిజన్ నాయకులు పద్దం లక్ష్మణరావు, ఓరుగంటి శ్రీను, కుర్సం ముఖేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఐటీడీఏ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు, పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు మునిగేలా శివ, ప్రశాంత్, గండుగుల రామ్ చరణ్,తెల్లం నరేష్,ఆదివాసీ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్‌లు వేరు వేరు ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

చర్ల: మండల కేంద్రంలోని విజయకాలనీలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయ, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం వైభవంగా సాగాయి. మాచవరానికి చెందిన ప్రముఖ వేదపండితులు ఎలమర్తి వీరభద్రశర్మ, కామేశ్వరశర్మ సారథ్యంలో ఆలయం, ఉపాలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌పై విధి నిర్వహణలో ఉండగా.. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీఓస్ నాయకులు డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తగిన ప్రణాళికలు వేసుకొని విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. వచ్చే ఏడాది సంబధించిన యూనిఫాంను జూన్ 1వ తేదీ నాటికి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హరిత, పద్మావతి, కొండలరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాదరావు

ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

ములకలపల్లి: మండలపరిధిలోని దివ్యాంగ చిన్నారులకు అలింకో సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మార్సీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ గద్దె రేవతి చేతుల మీదుగా వీటిని అందజేశారు. ప్రతీ బుధవారం ఏర్పాటు చేసే ఉచిత ఫిజియోథెరపీ శిబిరానికి క్రమం తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు. ఎంఈఓ సత్యనారాయణ, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీదేవి, ఐఈఆర్‌పీ కె.రాజశ్రీ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. మురుగునీరు వెళ్లకుండా డ్రెయినేజీని పూడ్చే యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ వి.రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతి అందజేసిన వారిలో స్థానికులు కత్తి రాము, వేముల వాసు, ఎంపీ.రాజయ్య, పి.సీతారాములు, కోడి వెంకటేశ్వర్లు, ఆర్.నరేందర్, పి.వెంకన్న, సీహెచ్.శేషు కుమార్, వి.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతానికి బైక్ ర్యాలీ

గుండాల: ఎస్టీ వర్గీకరణ కోసం నేడు ఇల్లెందులో నిర్వహించబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ.. తుడుందెబ్బ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంపిడి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు, ఈసం సాంబయ్య, వజ్జ ఎర్రయ్య, పూనెం శ్రీను, ఈసం లక్ష్మయ్య, గోవింద నర్సింహారావు, మహెందర్, భాస్కర్, వసంతరావు, జగ్గారావు, క్రిష్ణ, ప్రవీణ్, ప్రసాద్ తదిరతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల కూలీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రామదాసు సామిల్లులో బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం కూలి పనులు చేశారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ జయప్రదం కోరుతూ నిధుల సమీకరణ కోసం సామిల్లు యజమాని తుమ్మలపల్లి ధనేశ్వరరావు కొంత నిధిని పార్టీ కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, కొల్లం జయ ప్రేమ కుమార్, అంబటికర కృష్ణ, చిట్టి మల్ల అనిల్, కొలిపాక శివ, ఎస్‌కె.అబ్దుల్ ఖాదర్, నాగ సాయి మహిళా నాయకులు సలోమి తెల్లం రాణి తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్ర రథం వితరణ

గుండాల: మండల కేంద్రానికి చెందిన వ్యాపారి దివంగత మానాల భద్రయ్య-శాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు గ్రామ పంచాయతీకి బుధవారం అంతిమయాత్ర రథం వితరణగా అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ.. వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో మానాల భద్రయ్య కుమారులు ఏజెన్సీలోని ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటరమణ, పంచాయతీ అధికారి శ్యాంసుందర్ రెడ్డి, ఎస్సై రజమౌళి, మానాల నారాయణమూర్తి, మానాల వెంకటేశ్వర్లు, మానాల వీరన్న, మానాల ప్రభాకర్, శ్రావన్, ప్రణీత్, సతీష్,ఆర్యవైశ్య సంఘం సభ్యులు పల్లబోతు సాయిబాబా, గౌరిశెట్టి శ్రీనివాస్, అనుమోలు నాగేశ్వరావు, పొద్దుటూరి. కండె రమేష్, మాజీ జెడ్పీటీసీ రామక్క, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంతిమయాత్ర రథాన్ని అందిస్తున్న దృశ్యం

ఇంటింటా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: మండలంలో 'ఇంటింటికీ సీపీఎం' కార్యక్రమం చేపట్టి స్థానిక సమస్యలపై సర్వే చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం ములకపాడు సెంటర్‌లో యలమంచి సీతారామయ్య భవనంలో జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బుధవారం నుంచి వారం రోజుల వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో సమస్యలను వెలికి తీసి, ఆ గ్రామాల్లోనే ఆందోళనలు చేపడుతుందని, పరిష్కారం కానీ సమస్యలపై మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, కొల్లగాని బ్రహ్మాచారి ,మండల కార్యదర్శి కారం పుల్లయ్య,నాయకులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, యలమంచి శ్రీను బాబు, బొల్లి సత్యనారాయణ, కాక కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోషణపక్షం వారోత్సవాలు

పోషణపక్షం వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీఓ, ఇతర అధికారులు వారివారి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న సీడీపీఓ రేవతి



దుమ్ముగూడెం: సీతానగరం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు



అశ్వారావుపేటరూరల్: గర్భిణులకు వాయనం అందించిన సూపర్‌వైజర్ విజయలక్ష్మి

సమస్యలపై సీపీఎం ఆందోళన

బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం కార్యాలయం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లిన సీపీఎం నాయకులు.. అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతు సుందరయ్యనగర్‌లో ఇంటి నెంబర్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. సారపాకలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందటం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు పాపినేని సరోజని, షేక్ అబీదా, కనకం వెంకటేశ్వర్లు, మరియమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో సీపీఎం ఆధ్వర్యంలో మూడో రోజు బుధవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలపై సర్వే చేపట్టారు. మూడవ రోజు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి దండి రాములు, నాయకులు బొమ్మరాతి రామయ్య, గొడుగు వెంకన్న, బొడ్డు రాములు తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సారపాక జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ములకలపల్లి: గ్రామపంచాయతీల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మాధారం, చౌటిగూడెం. గుట్టగూడెం జీపీ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టి, కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, మంచాల సారయ్య. గడ్డం వెంకటేశ్వర్లు, బొర్రా జోగయ్య తదితరులు పాల్గొన్నారు.